సమస్యలతో విద్యార్థులు సహజీవనం

- ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు తప్పని ఇక్కట్లు
- అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు
- శిథిలావస్థకు చేరుకున్న భవనాలే దిక్కు



గతేడాది కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన తెనాలి గిరిజన బాలికల గురుకుల పాఠశాల (ఫైల్)

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

తెనాలిరూరల్/తెనాలిటౌన్: సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు, మౌలిక వసతుల లేమితో విద్యార్థులతో పాటు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. దుర్గంధం వెదజల్లే మరుగుదొడ్లు, శిథిలావస్థకు చేరుకున్న భవనాలు, అరకొర వసతులతో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ఎక్కడ ముంపునకు గురవుతుందోనని ఆందోళన చెందే పరిస్థితిలో విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారు.

➡ తెనాలిలో తొమ్మిది ప్రభుత్వ వసతి గృహాలు, రెండు గిరిజన గురుకుల పాఠశాలల్లో మొత్తం 654 మంది విద్యార్థులు ఉండి చదువుకుంటున్నారు. వీరిలో 244 కళాశాల విద్యార్థులు ఉన్నారు. ఎస్సీ బాలికల వసతి గృహం-1లో 13, ఎస్సీ బాలికల వసతి గృహం-2లో 45, బాలుర వసతి గృహం-1లో 47. కొలకలూరు వసతిగృహంలో 34, కలాజ్‌బాయ్స్ హాస్టళ్లలో 22, కాలేజ్ గరల్స్ హాసట్ల్‌లో 47, బీసీ కాలేజ్ బాయ్స్‌లో 50, బీసీ కాలేజ్ గర్ల్స్‌లో 125, బీసీ బాలుర వసతి గృహంలో 85, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 113, గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 73 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు.

➡ పట్టణ మారిస్‌పేట ఆర్‌ఆర్ నగర్‌లో రెండు ఎస్సీ బాలికల వసతి గృహాలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఉన్నాయి. ఇది పల్లపు ప్రాంతం కావడంతో ఈ కాలనీలో వర్షపు నీరు నిలుస్తుంటోంది. గతేడాది ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు వసతి గృహాలు, గురుకుల బాలికల పాఠశాల నీట మునిగాయి. ప్రిన్సిపల్ గది, స్టాఫ్ రూంలలోని ఫైళ్లు నీట మునిగాయి. విద్యార్థినులను సీఎం కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని పై అంతస్తులో, మిగిలిన ఎస్సీ బాలికల వసతి గృహాల విద్యార్థినులను మారిస్‌పేట ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో ఉండేలా ఏర్పాట్లను ఆయా వార్డెన్లతో తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గిరిజన గురుకుల పాఠశాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సెప్టెంబర్ 2వ తేదీన పరిశీలించారు. అతి త్వరలో నూతన భవనాన్ని నిర్మిస్తామని మంత్రి చెప్పినా ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. తెనాలిలో సాంఘిక సంక్షేమాధికారి పరిధిలోని ఐదు వసతి గృహాలు, గిరిజన గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ శాఖ వసతిగృహాలు అన్నింటిలో ఏ ఒక్క విద్యార్థికి మంచం సౌకర్యం కల్పించ లేదు. గతేడాది చలికాలంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, అతని మిత్ర బృందం అందించిన దుప్పట్లు, స్వెట్టర్లతో సరిపెట్టారు.



ఎస్సీ బాలికల వసతి గృహంలో కటిక నేల మీదనే అల్పాహారం తింటున్న విద్యార్థినులు

శిథిలావస్థలో వసతి గృహ భవనాలు

ఆర్‌ఆర్ నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం-1, వసతి గృహం-2 భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాలకు, ప్రహరీకి అంచనాలు సిద్ధం చేసినా ఫైళ్లు కదలడం లేదు. ఏళ్ల తరబడి ఇదే భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇవే వసతి గృహాల ఆవరణలో బాలికల గిరిజన గురుకుల పాఠశాల ఉంది. గురుకుల పాఠశాల విద్యార్థులకు భోజనశాల సరిపోవడం లేదు. ఇరుకుగానే కూర్చుని తినాల్సి వస్తోంది. ఆర్‌ఆర్ నగర్‌లోని బాలికల వసతి గృహం నూతన భవన నిర్మాణానికి పీఎం అజయ్ పథకం కింద నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారేకానీ భవన నిర్మాణానికి చొరవ చూపడం లేదు. ఎస్సీ బాలికల వసతి గృహానికి ఇటీవలి వరకు ప్రహరీ లేదు. వసతి గృహ పరిశీలనకు వెళ్లిన తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ప్రహరీ లేకపోవడ్నా గమనించారు. పట్టణానికి చెందిన దాత సూర్యదేవర భువన్ సహకారంతో ప్రహరీ నిర్మించి గేటును ఏర్పాటు చేసి వసతి గృహాలకు పెయింట్లు వేశారు. ఇక మరుగుదొడ్ల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. పగిలిన పైపులు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

క్లుప్తంగా

నివేశన స్థలాల పునఃపరిశీలన



తెనాలిరూరల్: పేదలకు కేటాయించిన నివేశన స్థలాల పునఃపరిశీలన కార్యక్రమం రూరల్ గ్రామం పెదరావూరులో శనివారం జరిగింది. గత ప్రభుత్వంలో పేదలకు నివేశన స్థలాలు కేటాయించేందుకు పెద్ద ఎత్తున భూసేకరణ చేసి, జగనన్న కాలనీల పేరట నివేశన స్థలాలు కేటాయించిన సంగతి తెలిసిందే. లబ్ధిదారుల ఎంపిక, నివేశన స్థలాల కేటాయింపు పారదర్శకంగా జరిగిందా? లేదా? అన్న విషయాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్థలాలను పరిశీలిస్తున్నారు. అలానే లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణాలనూ తహసీల్దార్ స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్, సిబ్బంది ఉన్నారు.

కార్గిల్ అమరులను స్మరించుకోవాలి



తెనాలిఅర్బన్: కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ప్రధానోపాధ్యాయుడు కప్పల రాజారెడ్డి పేర్కొన్నారు. 22వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీని చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 మే 3న కార్గిల్ యుద్ధం ప్రారంభమైందన్నారు. కార్గిల్ భాగాన్ని మనదేశం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండూరు శ్రీనివాసరావు, 22వ ఆంధ్ర బెటాలియన్ అధికారులు హవల్దార్ అజయ్ నాయక్, సుబేదార్ బిపిన్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ విజయ్‌ప్రసాద్ సేవలు అజరామరం



తెనాలిటౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన కెప్టెన్ విజయ్‌ప్రసాద్ సేవలు అజరామరమని బీజేపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కె.వాసు దేవనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక చెంచుపేటలోని కెప్టెన్ విజయ్‌ప్రసాద్ నివాసంలో ఆయన తల్లిదండ్రులను బీజేపీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్గిల్ 26వ విజయోత్సవ దివస్ సందర్భంగా దేశభక్తులను దేశంకోసం ప్రాణాలర్పించిన వారి కుటుంబాలను బీజేపీ ఆధ్వర్యంలో కలిసి సత్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.అనంతాచార్యులు, గోళ్ళ దేవరాజు, ఎస్.రవీంద్ర, కె.యోగానంద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవం కోసం స్నేహంపై పాట

తెనాలి: స్నేహితుల దినోత్సవం సందర్భంగా అయిదు దశాబ్దాల క్రితం విజయం సాధించిన 'స్నేహబంధం' సినిమాలోని పాటను రీమేక్ చేసి స్థానిక నటీనటులతో చిత్రీకరించటం మంచి విషయమని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. స్వరలయ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో స్నేహంపై చిత్రీకరించిన వీడియో పాటను శనివారం స్థానిక కొత్తపేటలోని అదితి గ్రాండ్ హోటల్‌లో తహశీల్దారు విడుదల చేశారు. గత నాలుగేళ్లుగా సందేశాత్మక లఘుచిత్రాలను తీస్తున్న సంస్థ అధినేత సాయి లక్కరాజు అభినందనీయులని అన్నారు. స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తూ మరిన్ని చిత్రాలను తీయాలని సూచించారు. సాయి లక్కరాజు మాట్లాడుతూ స్వరలయ ఆధ్వర్యంలో తీసిన పాటను ఆదరించాలని కోరారు. ముందుగా పాటను విడుదల చేసిన తహసీల్దార్ గోపాలకృష్ణ, అందులో నటించిన ప్రేమ్ కుమార్, మణికంఠ, శ్రీకర్, కెమెరామన్ వెంకయ్యను సత్కరించారు!

రేషన్ పంపిణీని ప్రారంభించిన తహసీల్దార్



తెనాలిరూరల్: వృద్ధులకు ప్రతినెలా ముందుగానే రేషన్ పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం శనివారం రేషన్ పంపిణీని పట్టణంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ప్రారంభించారు. వాస్తవానికి ప్రతినెల 1వ తేదీ నుంచి రేషన్ డీలర్ల వద్ద రేషన్ పంపిణీ జరుగుతుంది. అయితే షాపుకు వచ్చి రేషన్ తీసుకెళ్లలేని వృద్ధులు, వికలాంగులు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి నాలుగు రోజులు ముందుగానే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. వృద్ధులతో మాట్లాడి రేషన్ సరఫరాలో ఇబ్బందులు తెలుసుకున్నారు. నెలాఖరులోగా పంపిణీ పూర్తి చేస్తామని దానికి తగిన విధంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రేషన్ షాపులకు అనుగుణంగా సిబ్బందిని కేటాయించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 సర్వేను త్వరగా పూర్తి చేయండి



తెనాలిఅర్బన్: పీ-4 సర్వేను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పూలే కాలనీలో శనివారం సాయంత్రం జరిగిన పీ-4 సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. దాతల సహకారంతో వారిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ముందుగా కొత్తపేటలోని మహిళా మండలి భవనంలోని మెప్మా విభాగంలో సీవోలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీ-4 సర్వే విధి విధానాలను వారికి తెలియజేశారు. మెప్మా సీఎంఎం విజయ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండ్ పోటీల్లో పతకాలు



తెనాలి: విజయవాడలో జరుగుతున్న 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన హరిహంసిక డ్యాన్స్ అండ్ టై క్వాండో ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి పలు బహుమతులను అందుకున్నారు. ఈ పోటీల్లో హరిహంసిక విద్యార్థులు 8 బంగారు పతకాలు, 8 రజత పతకాలు, నాలుగు కాంస్య పతకాలను సాధించినట్లు ఇన్‌స్టిట్యూట్ కోచ్ ఎం.చిన్నా తెలియజేశారు. ఏపీటీఏ అధ్యక్షుడు టి.వర్ధన్‌ప్రసాద్, కార్యదర్శి చంద్రమౌళి చేతులమీదుగా బహుమతులను అందుకున్నట్లు తెలిపారు.

మెరుగైన ప్రయాణ సదుపాయాలే లక్ష్యం

డిస్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సామ్రాజ్యం



బస్టాండ్ ఆవరణను పరిశీలిస్తున్న సామ్రాజ్యం, ప్రక్కన డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించడమే ఆర్టీసీ లక్ష్యమని డిస్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సామ్రాజ్యం పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో శనివారం ఆమె పర్యటించారు. గ్యారేజీలోని అన్ని విభాగాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి డిపో పరిధిలో 81 బస్సులు ప్రయాణీకులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. వీటిలో 30 వేల మంది ప్రతిరోజు వెళ్తున్నట్లు వివరించారు. ప్రయాణీకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఫ్రీ బస్సు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదనే సంకేతాలు వచ్చాయన్నారు. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలన్నింటిపై చర్చిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఫ్రీ బస్సు ప్రకటించగనే మహిళలకు ఉచితంగా గమ్యస్థానాలకు చేరుస్తామన్నారు. పాత బస్సులన్నింటినీ ప్రక్కన పెట్టడం జరిగిందన్నారు. వాటి స్థానంలో నూతన బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు ఎప్పుడు?

- ప్రతిరోజూ కరెంటు సరఫరాకు అంతరాయం
- తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం



హాజరైన శివకోటేశ్వరరావు, సభ్యులు

తెనాలి: పట్టణ, పరిసరాల్లో పలు రహదారులు ధ్వంసమై ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం కోరింది. సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పలు సమస్యలను ప్రస్తావించారు. తెనాలి రూరల్ మండల గ్రామం పెదరావూరు నుంచి వేమూరు నియోజకవర్గంలోని కూచిపూడి మీదుగా అమృతలూరు రోడ్డు, చెరుకుపల్లి రోడ్డు, పరిమి రోడ్డు, చావలి-అమృతలూరు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. పెరవలి రోడ్డులో భారీ గోతులు పడి ఈతకు అనువుగా ఉన్నాయని తెలిపారు. పట్టణ 14, 15 వార్డుల్లో కొన్ని ఏరియాల్లో రోడ్లు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉన్నా, పట్టించుకోవటం లేదనీ, మరికొన్ని వార్డుల్లో రోడ్లు బాగున్నా, రోడ్డుపై రోడ్లు వేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక వీఎస్సార్‌కాలేజి- సోమసుందరపాలెం సర్వీస్‌రోడ్డు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఉందన్నారు. అయితానగర్- నేలపాడు రోడ్డు దుర్భరంగా తయారైందని వివరించారు. ఆయా రోడ్లను వేమూరు, తెనాలి ఎమ్మెల్యేలు పట్టించుకుని మరమ్మతులు చేయించాలని కోరారు. పట్టణంలో ప్రతిరోజూ 2-3 గంటల చొప్పున కరెంటు సరఫరాకు అవాంతరం కలుగుతోందని సంఘ సభ్యులు తెలియజేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళదామన్నా విద్యుత్ వినియోగదారుల సమావేశాలు ఏడాదికాలంగా జరగటం లేదని గుర్తుచేశారు. సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రావూరి శివశంకరరావు, వై.రమేష్, కాకాని రఘు, అబ్దుల్ ఆరిఫ్, ఎస్.రాజేష్, డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్.సత్యనారాయణ, కె.వాసు దేవనాయుడు, కె.సత్యనారాయణ, కొమ్ము అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

'కోట' అవార్డుకు ఎంపికైన లక్ష్మణశాస్త్రికి అభినందన



తెనాలి: విజయవాడకు చెందిన ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు పేరిట ఏటా బ్రాహ్మణ కళాకారుడికి 'కళాజ్యోతి కోట' అవార్డును ఇచ్చేందుకు నిర్ణయించింది. తొలి అవార్డును పట్టణానికి చెందిన యువ నటుడు, దర్శకుడు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రికి ప్రదానం చేయాలని తీర్మానించారు. దీనితో శనివారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులమీదుగా లక్ష్మణశాస్త్రిని సత్కరించారు. ఆరాధ్యుల కన్న, పిట్టు వెంకట కోటేశ్వరరావు, వెనిగళ్ల వెంకటేశ్వరరావు, ఆరిశెట్టి ఐశ్వర్య, వాడవల్లి రాజేష్, ఎం.గోపి, యలమద్ది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూలులో సైన్స్ ల్యాబ్ ఆధునికీకరణ

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆధునికీకరించిన సైన్స్ ల్యాబ్‌ను ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణకుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవడానికి ల్యాబ్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, ఎస్టేట్ బాబు, శివరామకృష్ణ, వెంకట స్వామి పాల్గొన్నారు.

తెనాలి సుందరీకరణకు చర్యలు



కాల్వ పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక



వార్డులో పర్యటిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించిపలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, తదితరులు ఉన్నారు.

● పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. 36వ వార్డులో శుక్రవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. రోడ్లపై చెత్త కనపడకూడదని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది ఉన్నారు.

చేనేత రంగ మహనీయుడు ప్రగడ కోటయ్య



ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

తెనాలిటౌన్: చేనేత రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు ప్రగడ కోటయ్యని బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రగడ కోటయ్యనగర్‌లో ప్రగడ కోటయ్య 110వ జయంతి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా చేనేత రంగ అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు ప్రగడ కోటయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ నేతలు వంగర సత్యనారాయణ, సీహెచ్.కోటిస్వామి, కె.అచ్చయ్య, డి.వెంకట సుబ్బారావు, జి.సువర్ణరాజు, కె.యుగంధర్, పి.శ్రీనివాసరావు, బి.వీరభద్రరావు, మౌనిక, నాగమల్లేశ్వర రావు, వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, కె.వంశీ, జె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్ల పంపిణీ చేస్తున్న దృశ్యం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జీవనలత

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు పౌష్టిక ఆహార కిట్లను పంపిణీ జరిగింది. రోటరీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ 'మెటర్నటీ అండ్ చైల్డ్ హెల్త్'లో భాగంగా రోటరీ సభ్యుల సహకారంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశామన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోతే పుట్టే పిల్లలకు కూడా రకరకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందని దీన్ని గుర్తించి గర్భిణులు డాక్టర్ల సూచన మేరకు సరైన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు.

ఇందుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో 25 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందించారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకట్ నారాయణ, కోశాధికారి వెంపటి, హరిప్రసాద్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జాస్తి నరేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి జీవనలత, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రకాశం రోడ్ లోని డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ డి.జీవనలత వైద్యపరీక్షలు చేశారు. నెలకు సరిపోను కాల్షియం బీ కాంప్లెక్స్ ఐరన్ క్యాప్సిల్స్, సిరప్‌లు అందజేశారు. పరీక్షలు చేయించుకున్న గర్భిణులకు వారు డెలివరీ అయ్యే వరకు అవసరమైన వైద్య పరీక్షలతో పాటు మందులను కూడా ఉచితంగా అందించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. గర్భిణులకు అవసరమైన మందులను క్లబ్ సభ్యుడు జవాజి శ్రీనివాసరావు సమకూర్చారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ కన్నెగంటి మురళీకృష్ణ, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జాస్తి నరేంద్ర కుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు

తెనాలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వేమూరు నియోజకవర్గం మోదుకూరులోని ఫొటోజెనిక్ ఆర్ట్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ సర్కిల్ అధ్యక్షుడు టి.సీతా రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కానాల సుధాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫొటోగ్రఫీని అంతర్జాతీయస్థాయిలో నిలిపిన డాక్టర్ ఎస్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబు స్మారకార్థం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జనరల్ ఫొటోలను కలర్, మోనోక్రోమ్‌లో ఆగస్టు 9వ తేదీలోగా పంపాలని సూచించారు. ఏపీ, తెలంగాణకు చెందిన ఫొటోగ్రాఫర్లు మాత్రమే అర్హులని, ఫొటోలు సొంతంగా తీసినవై ఉండాలని, ఒక్కో అభ్యర్థి ఒక్కో సెక్షనులో మూడు ఫొటోలను మాత్రమే పంపించాలని కోరారు. ప్రతి ఫొటోకు టైటిల్, అభ్యర్థి పేరు, ఫోన్ నంబరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలని వివరించారు. ఆసక్తి కలిగిన ఫొటోగ్రాఫర్లు తమ ఫొటోలను ఫొటోజెనిక్ ఆర్ట్ సర్కిల్‌కు మెయిల్ చేయాలని కోరారు. వివరాలకు 98480 92182, 9491336258 నంబర్లను సంప్రదించవచ్చని తెలియజేశారు.

సర్దార్ గౌతులచ్చన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న శంకరరావు

తెనాలి: ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తిచేశారు. ఆ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం సమర్పించినట్లు శనివారం తెనాలిలో తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సర్దార్ గౌతు లచ్చన్న తన 17 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. క్విట్‌ఇండియా, విదేశీ వస్తు బహిష్కరణ, శాసనోల్లంఘన వంటి ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రజలచే 'సర్దార్' అని పిలిపించుకున్నారని, స్వాతంత్ర్యం సిద్ధించాక అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మరోసారి ఎమ్మెల్సీగా పనిచేసిన బడుగు వర్గాల నాయకుడుగా గుర్తు చేశారు. బడుగు వర్గాలకు దేవాలయ ప్రవేశం కల్పించడం కోసం, హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ, వారికి దేవాలయం ప్రవేశం కల్పించిన బహుజన నాయకుడు గౌతు లచ్చన్నగా పేర్కొన్నారు. ఆయన విగ్రహాన్ని అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు.